పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# నేటి నుండే గ్రామ దేవత శ్రీసోమలమ్మ తల్లి తీర్థం ప్రారంభం...





**అడ్డతీగల, పెన్ పవర్, మే 24:**అడ్డతీగల గ్రామ దేవత శ్రీ సోమలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈనెల 25వ తేదీ నుంచి రెండు రోజులు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి, అమ్మవారి జాతరకు సర్వం సిద్ధమయింది. ప్రతి సంవత్సరము మే ఆఖరి వారంలో ఈ జాతరను కొన్ని దశాబ్దాలుగా జరుపుకోవడం ఆనవాయితీ, ముఖ్యంగా ఈ జాతరకు గ్రామస్తులు వ్యాపారస్తులు అధికారులు సహాయ సహకారాలతో నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుండి కూడా ఈ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవ్వడం జరుగుతుంది. ఈ జాతరకు గ్రామస్తులే కాకుండా బంధుమిత్రుల ను ఆహ్వానించి అతి ఘనముగా ఈ జాతరను జరుపుకుంటారు. మే నెల కావడంతో పిల్లలకు సెలవు దినాలు కావడంతో జాతరలో ఏర్పాటు చేసే రంగులరాట్నాలు, ఆట వస్తువులు తో ఏర్పాటు చేసే ఆటలు పెద్దలకు సాంస్కృతిక కార్యక్రమాలు గరగనృత్యాలు, శక్తి వేషాలు తో ఆహ్లాదకరంగా ప్రశాంతమైన వాతావరణంలో ఈ జాతర జరగడం విశేషం.



## మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన టిడిపి నాయకులు

**గంగవరం వద్ద స్టేజ్ నిర్మాణ పనుల తనిఖీ**

**గంగవరం, పెన్ పవర్, మే 24 :**పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలోని గంగవరం వద్ద ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులు పరిశీలించారు. మహానాడు కార్యక్రమం విజయవంతం చేయడానికి చేపడుతున్న స్టేజ్ నిర్మాణ పనులు, సమావేశ ప్రాంగణ ఏర్పాట్లు, కార్యకర్తలకు అవసరమైన సౌకర్యాలను నాయకులు పరిశీలించి సంబంధిత బాధ్యులకు సూచనలు చేశారు. కార్యక్రమానికి భారీగా పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు, మొల్లేరు సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, క్లస్టర్ ఇంచార్జ్ దుమ్ముల భాను ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి కనిగిరి సుభాష్, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, అముదాలబంద ఎంపీటీసీ పండా ఆదినారాయణ, మాజీ ఎంపీటీసీ కొసు బుల్లియమ్మ, గంగవరం పంచాయతీ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొమ్మనా చిన్నారావు, వీరవత్తుల రాజేంద్రప్రసాద్, శారపు సత్యవతి, కెల్లా సాగర్, మడకం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నీరు లేని నీటి తొట్టెలు

- మూగజీవాల దాహార్తి తీర్చేది ఎవరు?
- ప్రకటనలకే పరిమితమైన అధికారుల ఆదేశాలు

**వై రామవరం, పెన్ పవర్, మే 24:** మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నీరు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయని, అధికారులు మాత్రం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మండలంలో లక్షలాది రూపాయల ప్రజా ధనంతో ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు నిర్మాణం ఉపాధి హామీ పథకంలో నిర్మించారని గ్రామస్తులు తెలిపారు. కాంట్రాక్టర్లు నీటి తొట్టెలను నిర్మించారని వాటి నిర్వహణ బాధ్యత పంచాయితీ సిబ్బంది చూసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీల సర్పంచ్ ల పాలన ముగిసిన స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఒక్కొక్క నీటి తోట్టి నిర్మాణానికి 38,401 రూపాయి ఖర్చు చేయడం జరిగిందన్నారు. దీనిలో 1194 మంది ఉపాధి కూలీలు పని దినాలు ఉండగా, 37,207 రూపాయలు సామాగ్రి కోసం ఉపయోగించారని తెలిపారు. ఇంత ప్రజాధనం ఖర్చు చేసిన మూగ జీవాల దాహార్తి తీర్చాలనే లక్ష్యం నెరవేరలేదని ఆరోపిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు కోట్లు ఖర్చు చేసి రెండు వేల నీటి తొట్టెలు నిర్మించినట్లు అధికారులు తెలియజేశారు. మండలంలో చవిటి దిబ్బల గ్రామంలో వాటర్ ట్యాంక్ సమీపంలోనే పశువుల మంచినీటి తొట్టె ఉందని, నిర్మించిన నాటి నుండి నేటి వరకు నీరే నింపలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలలో నీటిని నింపవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుచున్నారు.






## గోవింద గిరి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలు

**జూన్ 9న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం -- జూన్ 15న శ్రీనివాస కళ్యాణం**

**గంగవరం/ రంపచోడవరం పెన్ పవర్ ,మే 24:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఐ.పోలవరం గోవింద గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తృతీయ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పార్థు స్వామి, మణికంఠ స్వామి ఆలయ ఇన్స్పెక్టర్ అంచూరి శిరీష తెలిపారు.

ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా జూన్ 9న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆలయ ప్రాంగణ పరిశుభ్రత, పవిత్రత కోసం నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమంలో అర్చకులు వైఖానస సంప్రదాయ పద్ధతిలో విశేష పూజలు నిర్వహించనున్నారు.

అలాగే జూన్ 15న శ్రీ వారి తృతీయ వార్షికోత్సవ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం నిర్వహించబడనున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి శ్రీనివాస కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

అనంతరం స్వామివారి మాడవీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.



## రానున్న ఐదు రోజులు ఎండల తీవ్రత అధికం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్
- 12 మండలాల్లో తీవ్ర ఉష్ణోగ్రతల హెచ్చరిక



**గంగవరం, పెన్ పవర్ మే 24 :** రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని గంగవరం తహసీల్దార్ సిహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లాలోని 12 మండలాల్లో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 54 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. తీవ్రమైన ఎండల కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, తగినంత నీరు తాగుతూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని తెలిపారు. తేలికపాటి దుస్తులు ధరించడం, నీడ ప్రాంతాల్లో ఉండడం, బయట పనులు చేసే వారు టోపీలు, గుడ్డలు ఉపయోగించడం మంచిదని సూచించారు. ఉపాధి హామీ శ్రామికులు, వ్యవసాయ కార్మికులు, నిర్మాణ కార్మికులు ఎండ వేళల్లో ఎక్కువసేపు పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే ఎండల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నిధులిచ్చి నిర్మాణాలు కొనసాగిస్తారా..!

–అసంపూర్తి సచివాలయ భవనాలు

ఏలూరు మే24 పెన్‌పవర్ :గత వైకాపా ప్రభుత్వం సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి భవనాలు మంజూరు చేసింది. వాటిని పూర్తి చేయడంలో విఫలమైంది. గుత్తేదారులకు బిల్లులు చెల్లించక పోవడంతో వారు ఎక్కడికక్కడ పనులు అసంపూర్తిగా నిలిపివేశారు. దెందులూరు,ఉంగుటూరు నియోజక వర్గాలలోని దెందులూరు, భీమడోలు,పెదపాడు,పెదవేగి, ఏలూరు రూరల్,మండలలాల్లో దెందులూరు నియోజక వర్గంలో 85 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. వాటిలో సగం గ్రామాల్లోనూ నిర్మాణాలు పూర్తి చేయలేదు. కేవలం 25 భవనాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వచ్చారు. మరో 10 సచివాలయం భవనాలు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. మరికొన్ని స్లాబు దశలో నిలిచిపోయాయి. 81పంచాయితీలకు 75 సచివాలయ భవనాలు భవనాలు మంజూరయ్యాయి. ఇక్కడ ఎక్కువ శాతం గ్రామాల్లో నిర్మాణాలను ప్రారంభించలేదు. అధికారులు స్పందించి అసంపూర్తి భవనాలు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు

భీమడోలు మండలం : 13 గ్రామ పంచాయితీలు ఉండగా8 సచివాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. సూరప్పగూడెం పంచాయితీలో భవనం అసంపూర్తిగా నిలిచాపోవడంతో సిబ్బంది పంచాయితీ కార్యాలయ భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

పెదపాడు మండలంలో లో 22 సచివాలయాలు ఉండగా పదింటికి మాత్రమే పూర్తి స్థాయిలో భవనాలు ఉన్నాయి. కలపర్రు,కొక్కిపాడు,వసంతవాడ చివరి దశలో నిలిచిపోగా..కొద్ది పాటి నిధులు కేటాయిస్తే భవన నిర్మాణాలు పూర్తవుతాయి





**ఉన్నతాదికారుల దృష్టికి**

నిలిచిపోయిన భవన నిర్మాణాలు,అసంపూర్తి,కొద్దిపాటి నిధులు కేటాయిస్తే పూర్తయ్యే భవన నిర్మాణాల విషయాన్ని ఉన్నతాదికారులు దృష్టికి తీసుకెళ్లాం. మిగతా భవనాలు నిర్మించేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపామని పంచాయితీ రాజ్‌శాఖ పి.ఆర్ ఏలూరు డివిజన్ డీఈ బి.వి.శ్రీనివాస్ తెలిపారు

